క్షయ వ్యాధి లక్షణాలపై శిక్షణ

అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర కో-ఆర్డినేటర్లు ఉషారాణి, శ్వేత

కోటగిరి, ఫిబ్రవరి 15 : క్షయ వ్యాధి లక్షణాలను గుర్తించడంపై మండలకేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. వైద్య శాఖ రాష్ట్ర కో-ఆర్డినేటర్లు ఉషారాణి, శ్వేత క్షయ వ్యాధి లక్షణాల గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, రాజేందర్, కోటగిరి సీహెచ్‌సీ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ఎంఎడ్ పరీక్షల టైంటేబుల్ విడుదల

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 15 : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఎడ్ మూడో సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి మార్చి 4వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మున్నూరు కాపు సంఘం రుద్రూర్ కార్యవర్గం ఎన్నిక

రుద్రూర్, ఫిబ్రవరి 15 : మండలకేంద్రంలో నాలుగు తర్పల మున్నూరు కాపు సంఘం సభ్యులు శనివారం సమావేశమై గ్రామ మున్నూరు కాపు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం గ్రామ అధ్యక్షుడిగా పత్తి రాము, ప్రధాన కార్యదర్శిగా ఇందూర్ కార్తీక్, కోశాధికారిగా పార్వతి శేఖర్, ఉపాధ్యక్షులుగా అడప సాయిలు, కర్క అశోక్, కొప్పర్గ గంగాధర్, జల్లాపురం సాయికుమార్, జాయింట్ సెక్రటరీలుగా అడప శంకర్, ఉప్పు గంగాధర్, ఇందూర్ తులసీరాం, జల్లాపురం సాయిలు (ఎస్టీడీ), గౌరవ సలహాదారులుగా ఇందూర్ చంద్రశేఖర్, దుర్కి సాయన్న, పత్తి లక్ష్మణ్, కొట్ట లక్ష్మణ్, జక్కు నర్సింహులు, తోట్ల గంగారాం, నాగం అశోక్, చంద రవికుమార్, కాసుల శ్రీనివాస్, జల్లాపురం నడిపి సాయిలుతోపాటు 19 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

ధర్పల్లి, ఫిబ్రవరి 15 : మండలకేంద్రంలోని పెద్దచెరువు కట్టపై ఉన్న గంగమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను శనివారం ఏర్పాట్లు చేసినట్లు జీపీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 26న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యతో తరలిరానుండడంతో లైట్లను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోటగిరి, ఫిబ్రవరి 15 : మండలకేంద్రంలో పేకాడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కోటగిరిలోని రచ్చగల్లీలో ఉన్న ఓ సంఘ భవన పక్కన పేకాడున్నట్లు సమాచారం అందించడంతో దాడులు నిర్వహించి, పేకాడుతున్న జూదరులను పట్టుకున్నామని, వారి నుంచి రూ.23,440 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఘనంగా సంత్ సేవలాల్ జయంతి

సేవాలాల్, జగదాంబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సేవాలాల్ విగ్రహానికి పూజలు చేస్తున్న కలెక్టర్, అధికారులు, బంజారాలు

సిరికొండ మండలం చీమన్‌పల్లిలో పూజలు చేస్తున్న గిరిజనులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా గిరిజనులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్, జగదాంబ మాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన విగ్రహాలు చిత్రపటాలకు పూజలు చేశారు. అనంతరం బంజారా సంప్రదాయం ప్రకారం భోగ్‌భండార్ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. వినాయక్‌నగర్‌లోని సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి కలెక్టర్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల బాధ్యులు జిల్లా అధికారులతో కలిసి పూలమాలలు వేశారు. అనంతరం భోగ్ భండార్‌లో పాల్గొన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ పూజలు చేశారు. కోటగిరిలోని దేవునిగుట్ట తండాలో, డిచ్‌పల్లి మండలం రాంపూర్ తండాలో, సిరికొండ మండలంలోని బంజారా భవన్, గిరిజన తండాలో, ఇందల్వాయి మండలంలోని అన్ని తండాల్లో సేవాలాల్ జయంతి నిర్వహించారు.

బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని శక్కర్‌నగర్ గ్రామంలో భోగ్‌బండార్ నిర్వహించారు. అన్నదానం చేశారు. బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండా, ఊట్‌పల్లి, బెల్లాల్, ఆటోనగర్, మినార్‌పల్లి,పెంటకుర్దు తండా, నర్సాపూర్ తండాల్లో సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భోగ్ బండార్, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంత్‌సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ శివారులోని తండాలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గిరిజన తండాలో సేవాలాల్, జగదాంబ మాత ఆలయాల వద్ద బంజారాలు పూజలు నిర్వహించారు. భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

బోధన్ పట్టణ పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో భోగ్‌బండార్ నిర్వహిస్తున్న గిరిజనులు

విగ్రహాలు, డీజేల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 15 : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో జనాలు రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కుల్లో విగ్రహాలు, డీజేల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలని ఇన్‌చార్జీ సీపీ సింధూశర్మ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఊరేగింపులు, బహిరంగ సభల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలనుకుంటే అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని, 500 మందితో సమావేశాలు, సభలు నిర్వహించే వారు 72 గంటల ముందే ఏసీపీ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నిబంధనలు ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గల్ఫ్ ఏజెంట్లను నమ్మిమోసపోవద్దని పేర్కొన్నారు.

మందకృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మందకృష్ణకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇందల్వాయి, ఫిబ్రవరి 15 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో శనివారం కలిశారు. పద్మశ్రీ అవార్డు రావడంతో ఆయనను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో ఇందల్వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి ఎమ్మార్పీఎస్ నాయకులు నాగభూషణం, కిష్టయ్య, రాజేశ్, నరేశ్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

సిరికొండలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

సిరికొండ/ ధర్పల్లి, ఫిబ్రవరి 15 : రోడ్డు భద్రతపై అధికారులు శనివారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. సిరికొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, చీమన్‌పల్లి చార్వాక విద్యాలయం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. తెలంగాణ చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, లారీలకు రేడియం స్టిక్కర్లను తహసీల్దార్ రవీందర్‌రావు అతికించారు. వాహనదారులు వేగంగా వెళ్లడం మానుకోవాలని, రోడ్డునిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు, ప్రధానోపాధ్యాయులు రాజేశ్‌రెడ్డి, జోగి నిపల్లి ప్రసాద్, ఉపాధ్యాయులు హేమలత, సాయన్న, ప్రశాంత్, పీడీ కిషన్ పాల్గొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు.

రోడ్డు భద్రత నియమాలపై ప్రతిజ్ఞ

బాల్కొండ, ఫిబ్రవరి 15: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శనివారం ప్రార్థన సమయంలో విద్యార్థులకు రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించామని ఎంఈవో తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల చివరి రోజు పాఠశాల విద్యా శాఖ ఆదేశం మేరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్ ప్రతినిధులు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 15 : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందును నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌గౌడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం కలిశారు. అజంతా ట్రైన్‌లో దైవ దర్శనానికి వెళ్తుండగా.. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో కాసేపు ఆగిన ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు ప్రమోద్, గంగోని శుభం, విశ్వక్‌సేన్, బాలాజీ, ఆశనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందుతో నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు

అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 15 : అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జాతీయస్థాయి పోటీలకు నగరంలోని సెయింట్ జేవియర్స్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సిహెచ్. వర్ణశ్రీ (5వ తరగతి), డి.సాత్విక్ (8వ), వై.అజయ్ (9వ) ఎంపికయ్యారు. వారిని శనివారం పాఠశాల చైర్మన్ పి.నర్సింహారావు, ప్రిన్సిపాల్ లతాగౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పొతంగల్, ఫిబ్రవరి 15 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మండలంలోని కొడిచర్ల శివారులో పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

రావుట్లలో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

సిరికొండ, ఫిబ్రవరి 15 : మండలంలోని రావుట్ల గ్రామంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ డీఈ ఉత్తమ్ జాడే శనివారం ప్రారంభించారు. గ్రామంలో వోల్టేజీ సమస్య ఉండడంతో గ్రామస్తుల విన్నపం మేరకు ఎమ్మెల్యే సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించామని వీడీసీ సభ్యులు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, లైన్‌మన్ సురేశ్, మాజీ ఎంపీటీసీ గొల్ల ఎర్రన్న, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఇందల్వాయి, ఫిబ్రవరి 15 : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో కర్నాటి యాదగిరి సంతాపసభ పోస్టర్లను సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి సాయాగౌడ్ శనివారం ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన యాదగిరి సంతాప సభను రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సంగయ్య, నారాయణ, రాజు, సాయిలు, లక్ష్మి, పోశెట్టి, సాయన్న, నర్సయ్య, గంగామణి పాల్గొన్నారు.

లారీ కిందికి దూసుకెళ్లిన ట్రాక్టర్

పొతంగల్, ఫిబ్రవరి 15 : పొతంగల్ మండల శివారులో బుస లారీ కిందికి ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. పొతంగల్ వైపు వెళ్తున్న లారీని దాని వెనుక సిమెంట్, ఇటుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొట్టింది. లారీ కిందికి ట్రాక్టర్ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వీవోఏలకు ఆరోగ్యభద్రతపై అవగాహన

ఇందల్వాయి, ఫిబ్రవరి 15 : మండల సమాఖ్య సమావేశంలో వీవోఏలకు ఆరోగ్య భద్రతపై మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్ శనివారం అవగాహన కల్పించారు. పౌష్టికాహారాలు ఉండే ఆహార పదార్థాలు, వ్యాయామం, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ మేనేజర్ సువర్ణ, సీసీ అనురాధ, వీవోఏలు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15: పట్టణంలోని వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కందుల మద్దతు ధర క్వింటాలుకు రూ.7,550 ఉన్నదన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ మేనేజర్ నగేశ్, ఏబీఎం చిన్నా, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

భీమ్‌గల్, ఫిబ్రవరి 15: ఇంటిపన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ అన్నారు. పట్టణంలో ఇంటి పన్ను వసూలుకు శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయా వార్డుల్లో కొనసాగుతున్న ఇంటి పన్ను వసూళ్లను పరిశీలించారు. ఇంటి పన్ను చెల్లించని వారికి 2019 చట్టం ప్రకారం నోటీసులు ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతాపసభను విజయవంతం చేయాలి

మోర్తాడ్/ఏర్గట్ల, ఫిబ్రవరి 15: ఈనెల 17న నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు యాదగిరి సంతాపసభకు ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి కిషన్ కోరారు. మోర్తాడ్, తిమ్మాపూర్, దొన్కల్ గ్రామాల్లో శనివారం సంతాపసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నక్క, దయాల్‌సింగ్, గంగు, మజీద్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు. ఏర్గట్ల జీపీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మిక సిబ్బందితో కలిసి శనివారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఏర్గట్ల, మోర్తాడ్ మండలాల కార్యదర్శి, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ పోస్టర్లు ఆవిష్కరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మోర్తాడ్, ఫిబ్రవరి 15: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఫౌండేషన్ డెవలప్‌మెంట్ అధికారి అఖిల, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ చింత శ్రీనివాస్ పొదుపు, ప్రభుత్వ పథకాలు, జీవితబీమా, సైబర్‌క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు సాయన్న, శ్రీనివాస్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేపల వల చుట్టుకొని వ్యక్తి మృతి

బాల్కొండ, ఫిబ్రవరి 15: ఎస్సారెస్పీ నాగాపూర్ బ్యాక్‌వాటర్‌లో చేపలు పడుతున్న క్రమంలో వల కాళ్లకు చుట్టుకొని బట్టు నారాయణ(55) నీటిలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాల్కొండ పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎడపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని జానకంపేట్‌లో తాళం వేసిన ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీలా భాస్కర్ శుక్రవారం తన అన్న కుమారుడి పెండ్లికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ఇంట్లోకి ప్రవేశించి సుమారు 10 తులాల బంగారు నగలు, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.మూడు లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పలువురి బైండోవర్

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 15 : బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పలు పార్టీలకు చెందిన నాయకులతో పాటు ఇతర వ్యక్తులను శనివారం బోధన్ పట్టణ పోలీసులు బైండోవర్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. వీరికి పోలీసులు పలు సూచనలు చేశారు. అన్ని కేసుల్లో ఉన్న అందరినీ బైండోవర్ చేస్తామని పట్టణ సీఐ వెల్లడించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మోర్తాడ్/ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15: రాష్ట్రప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని దళిత సంక్షేమ సంఘం మోర్తాడ్ మండల అధ్యక్షుడు మల్లూరి రాజారాం డిమాండ్ చేశారు. మోర్తాడ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. సమావేశంలో గంగాధర్, బాబూరావు పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ఆ సంఘ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్‌తో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు హుస్సేన్, రాహుల్, కల్యాణ్, పవన్, సాయి, నిషాంత్ పాల్గొన్నారు.

23న నిరుద్యోగ మహిళలకు జాబ్ మేళా

బాల్కొండ, ఫిబ్రవరి 15: చిట్టాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానందరెడ్డి సౌజన్యంతో సుమారు వెయ్యి మంది మహిళా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు దక్షిణ ఆసియా మైత్రి సదస్సు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సెక్రటరీ జనరల్ బ్రహ్మ రౌతు నర్సింగరావు తెలిపారు. జాబ్‌మేళాను చిట్టాపూర్‌లోని వసంత ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స

మాక్లూర్, ఫిబ్రవరి 15:కొత్తపల్లి గ్రామంలో శనివారం గ్రామ శక్తి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఉమామసాహెర్ ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎఫ్‌జీ సిబ్బంది, పశువైద్య సిబ్బంది వినీత, కల్యాణి, పాషా, శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15: పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం చైల్డ్ హుడ్ క్యాన్సర్ డేను లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

అయ్యప్పస్వామికి ఎమ్మెల్యే వేముల పూజలు

పూర్ణహుతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, ఫిబ్రవరి15: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో రెండు రోజుల నుంచి వివిధ పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కన్నె సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ భగత్, మాజీ కౌన్సిలర్లు ప్రసాద్, నర్సయ్య, లింబాద్రి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే పేదరిక నిర్మూలన

మోర్తాడ్, ఫిబ్రవరి 15: మహిళా సంఘాల సభ్యులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నపుడే పేదరిక నిర్మూలన లక్ష్యం సాధ్యమవుతుందని ఏపీఎం కుంటగంగాధర్ అన్నారు. శనివారం కమ్మర్‌పల్లి మండల సమాఖ్య కార్యాలయంలో ఆరోగ్యం-పోషణ అనే అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు ఎక్కువ శాతం తీసుకోవాలని సూచించారు. ఈ అంశంపై ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి సభ్యులందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి, సీసీలు రవి, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, పీరియా, అలేఖ్య, అనసూయ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఏపీఎం వినోద్ కుమార్

బోధన్ మండలంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు మహిళా సంఘాల సభ్యులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు వీవోఏలు, గ్రామ సంఘాల అధ్యక్షురాలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బాల్కొండ, ఫిబ్రవరి 15: సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎంఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. బాల్కొండ జడ్పీహెచ్ఎస్‌లో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ డయల్ చేయాలన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 15 : ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో శనివారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఏడుగురిపై దాడిచేసి గాయపర్చింది. కుక్క కరిచిన వారిని ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్యం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. కుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవీపేట, ఫిబ్రవరి 15: మండలంలోని నాళేశ్వర్‌లో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్‌ను సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు, యూత్ అధ్యక్షుడు చిన్నదొడ్డి ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్ ప్రారంభించార